క్లుప్తంగా

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

గోనెగండ్ల: గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. మండలంలోని కున్నూరు గ్రామంలో ఆదివారం ఎస్‌ఐ తిమ్మారెడ్డితో కలిసి డీఎస్పీ పర్యటించారు. గ్రామంలోని సమస్యలపై డీఎస్పీ గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని, గొడవలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అంతేగానీ సొంత నిర్ణయాలు తీసుకొని గొడవలకు తావివ్వొద్దన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

1,855 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాల పంపిణీ

కృష్ణగిరి: మండలంలోని అన్ని ఆర్‌బీకేల ద్వారా ఇప్పటివరకు 1,855 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. అవసరమైన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే విత్తనాలు అందిస్తున్నామని, విత్తనాలు తీసుకున్న ప్రతి రైతు పంటను సాగు చేయాలన్నారు. అలాకాకుండా దళారులకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మండలానికి 2,094 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించగా ఇప్పటివరకు 2,234 మంది రైతులకు 6,186 బ్యాగ్‌లను (1855 క్వింటాళ్లు) పంపిణీ చేశామని తెలిపారు. వారం రోజుల క్రితం కొన్ని గ్రామాల్లో పంటలు సాగు చేశారని మళ్లీ వర్షం పడితే పూర్తి విస్తీర్ణంలో పంటలు సాగు అవుతాయని, విత్తనశుద్ధి తప్పక చేయాలని రైతులకు సూచించారు.

అర్హులందరికీ ఇంటి పట్టాలు

మద్దికెర: సొంతిల్లు లేని పేదలందరికీ ఇంటి పట్టాలు అందిస్తామని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. రాష్ట్రంలో సొంతిల్లు లేని పేదలు ఉండరాదన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. మద్దికెరలో కొండమ్మబావి వద్ద వెలసిన జగనన్న కాలనీలో ఇప్పటికే 250 మందికి ఇంటి పట్టాలు అందించినట్లు వివరించారు. ఇంటి పట్టాలు పొందిన వారు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని, వారికి హౌసింగ్ బిల్లులు సకాలంలో మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉన్నా ఇంకా రాని వారికి కూడా ఇంటి పట్టాలు త్వరలోనే అందిస్తామన్నారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

ఎమ్మిగనూరుటౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంబేడ్కర్ స్టడీ సర్కిల్ కో–ఆర్డినేటర్ బలరాముడు ఆదివారం తెలిపారు. ఇంటర్మీడియెట్ కోర్స్ పూర్తి చేసిన వారు అడ్మిషన్లు పొందడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు 73829 29823,73829 29823 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

మద్దికెర: మండలంలో నీటి వసతి కలిగిన కలిగిన రైతులు పండ్ల తోటల సాగుపై ఆసక్తి చూపాలని ఎంపీపీ అనిత, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల సాగుకు చిన్న, సన్నకారు రైతులు ముందుకు రావాలన్నారు. తోటల సాగుకు మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. దాదాపు 20 రకాల పండ్ల మొక్కలు ఇవ్వడం జరుగుతుందని వీటికి నీటి అవసరం తక్కువగా ఉంటుందన్నారు. ఐదెకరాల్లోపు పొలం కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కారం



చెన్నంపల్లిలో పైపులైన్ పనులు చేస్తున్న దృశ్యం

తుగ్గలి: మండల పరిధిలోని చెన్నంపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్య ఎట్టకేలకు పరిష్కారమవుతోంది. కొన్నేళ్లుగా నెలకొన్న నీటి సమస్యను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే బోరు వేయించారు. మూడు ఇంచుల నీళ్లు పడ్డాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధుల్లో రూ.12.50 లక్షలు పైపులైన్ నిర్మాణానికి కేటాయించడంతో ఆదివారం పనులు ప్రారంభమయ్యాయి. తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే శ్రీదేవికి వైఎస్సార్‌సీపీ నాయకులు రంజాన్‌బాషా, సుభాన్, పులికొండ, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యమస్తు

- అందుబాటులో అర్బన్ వైద్య కేంద్రాలు
- ఆధునిక హంగులు, అధునాతన సౌకర్యాలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు



మైనార్టీ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్

ఎమ్మిగనూరు: పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాల అభివృద్ధికి మెరుగైన బాటలు వేశారు. 'నాడు–నేడు' కార్యక్రమంతో పాఠశాలలు, కళాశాలల రూపురేఖలు మార్చుతున్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ కమ్యూనిటీ హెల్త్ ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రుల ఆధునీకరణకు నడుంబిగించారు. ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేస్తూ కొత్త పోస్టులను సృష్టిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా పట్టణ పేదలకు అందుబాటులో సేవలందించేలా అర్బన్ హెల్త్ సెంటర్లను కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ఆధునిక హంగులతో నిర్మించారు. ఎమ్మిగనూరు పట్టణంలోని నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లను ఆధునీకరించి సౌకర్యాలను మెరుగుపర్చారు. కొత్త భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.1.6 కోట్లు వెచ్చించింది.

నిరంతర సేవలు

అర్బన్ హెల్త్ సెంటర్లను పట్టణంలోని మురికి వాడల ప్రజలు, కార్మిక–కర్షక వర్గాలు అధికంగా ఉండే శివన్ననగర్, సంజీవ్ నగర్, సోమప్ప నగర్, మైనార్టీ ఖబుల్లా కాలనీలో ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. ఇక్కడ వాంతులు, విరేచనాలు, జ్వరం, దగ్గు, వైరల్ ఫీవర్, బీపీ, షుగర్‌వంటి రుగ్మతలతో పాటు మరిన్ని రోగాలకు చికిత్సలు అందిస్తున్నారు. అర్బన్ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అవసరమైతే పట్టణంలోని 100 పడకల కమ్యూనిటీ వైద్యశాలకు తరలిస్తారు. నాలుగు యూహెచ్‌పీల ద్వారా రోజుకు 200 నుంచి 300 మంది వరకు చికిత్సలు అందిస్తున్నారు. ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతో వైద్యుల పోస్టులు పెరిగాయి. నిష్ణాతులచే గైనిక్, దంత, కంటి, ఆర్థోపెడిక్, పిడియాట్రిక్ వంటి సేవలు విస్తృతమయ్యాయి. శస్త్రచికిత్సలు విస్తరించాయి. ఫలితంగా పేదవర్గాల ప్రజలు ప్రవేట్ ఆసుపత్రులను ఆశ్రయించకుండా అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రాథమిక చికిత్సలు పొందుతూ మందులు ఉచితంగా తీసుకొంటున్నారు. బీపీ, షుగర్ మాత్రలు నెలకు సరిపడా ఉచితంగా ఇస్తున్నారు.

మెరుగైన సదుపాయాలు

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత గ్రామీణ పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ కేంద్రాల పటిష్టతకు చర్యలు చేపట్టారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేసి ప్రతి కేంద్రంలో డాక్టర్లను నియమించి సేవలు విస్తృతపరిచారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రత్యేకంగా మెడికల్ డిస్పెన్సరీ, టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. పేషెంట్లకు మంచాలు, స్ట్రెక్చర్లు ఏర్పాటు చేశారు. గర్భిణులు, రక్తహీనత ఉన్నవారికి రక్తం అందించే ఏర్పాట్లు చేశారు. గర్భిణులకు అత్యవసరమైతే కాన్పులు చేసేలా ఆదేశాలు జారీ చేసింది ప్రభుత్వం. అటు ప్రభుత్వాసుపత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసి స్పెషలిస్టు డాక్టర్లతో శస్త్రచికిత్సలు, ఆధునాతన పరీక్షలు చేయిస్తుండడం, ఇటు అర్బన్ కేంద్రాల్లో ప్రాథమిక చికిత్సలు, ప్రాథమిక టెస్ట్‌లు చేస్తుండటంతో కార్పొరేట్–ప్రవేట్ ఆసుపత్రుల దోపిడికీ కళ్లెం పడుతుందని ప్రజలు భావిస్తున్నారు. కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు పెరగడం, రోగుల్లో అవగాహన రావటంతో అందరికీ వైద్యం అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా కనిపిస్తోంది.

రోగులపట్ల ఆప్యాయత చూపుతున్నారు



అర్బన్ హెల్త్ సెంటర్లలో డాక్టర్, సిబ్బంది పనితీరు బాగుంది. రోగుల పట్ల ఆప్యాయత చూపుతున్నారు. బీపీ, షుగర్ చెకింగ్‌కు రెగ్యులర్‌గా వస్తా. నెలరోజులకు సరిపడా బీపీ–షుగర్ మాత్రలు ఇస్తున్నారు. ఇందుకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో అయితే వేలకు వేలు ఖర్చవుతుంది. – జేవీ రావు, రిటైర్డు ఆర్టీసీ డ్రైవర్

పేదలకు మేలు చేసే ప్రభుత్వం



ప్రజలకు మేలుచేసే ప్రభుత్వం ఇది. లేబర్ కాలనీల్లో ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా అర్బన్ ఆసుపత్రులు పెట్టి అన్నిరకాల వైద్యసేవలు అందిస్తున్నారు. మాకు ఏ రకమైన ఇబ్బందులొచ్చినా ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉందనే ధైర్యం, భరోసాను ముఖ్యమంత్రి జగనన్న కల్పించారు. – మైమూన్, ఎమ్మిగనూరు

అందుబాటులో 60 రకాల వైద్య పరీక్షలు



అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రజలకు అవసరమయ్యే అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. 60 రకాల వైద్య పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. గర్భిణులకు ప్రతి గురువారం ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నాం. ధూమపానం, మద్యంకు బానిసైన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి చికిత్సలు చేస్తున్నాం. ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. – సాయి జాహ్నవి, వైద్యాధికారిణి

దిశ యాప్‌తో రక్షణ

మద్దికెర: ఆపదలో ఉన్న మహిళలను రక్షించేందుకు రూపొందించిన దిశా యాప్ ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో ఉండేలా చూసుకోవాలని ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ సూచించారు. ఆదివారం మద్దికెరలో దిశ యాప్‌పై అవగాహన కల్పించి డౌన్‌లోడ్ చేయించారు. ఆయన మాట్లాడుతూ దాడులు, అత్యాచారాలు, నేరాలు వంటి వాటి నుంచి సెల్‌ఫోన్‌లో ఒక్క బటన్ నొక్కడం ద్వారా మహిళలు రక్షణ పొందవచ్చని వివరించారు. ఆపదలో ఉన్న వృద్ధులు, ఎవరైనా యాప్‌ను ఉపయోగించుకోవచ్చన్నారు. పోలీసు సిబ్బంది రామిరెడ్డి, చెన్నయ్య, భరత్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

20న చలో విజయవాడ

వెల్దుర్తి: ఈనెల 20న చలో విజయవాడ నిర్వహించి అక్కడ మహాధర్నా చేపట్టనున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.నాగమద్దయ్య తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో కార్మికులతో సమావేశమై మాట్లాడారు. కేంద్ర నిధులు ప్రతి కార్మికుడికి అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్న డిమాండ్‌తో మహా ధర్నా చేపడుతున్నట్లు, కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సంఘం మండల ప్రతినిధులు ఆంజనేయులు, చిన్న మాదులు, ఏఐటీయూసీ ప్రతినిధులు ఏసయ్య, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పురుషోత్తం ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ తప్పక హాజరుకావాలని ఆయన కోరారు. ప్రజలు సమస్యలపై ఈ కార్యక్రమంలో అర్జీలు ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు.

విద్యతోనే సామాజిక అభివృద్ధి



టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తున్న కొంకతిలక్ష్మినారాయణ, అంబికాజైన్

ఎమ్మిగనూరు టౌన్: విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని చదవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంకతి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను రోహిణి ఇన్‌ఫ్రా అవెన్యూస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని కుర్ని కల్యాణ మండపంలో నగదు ప్రోత్సాహకంతో పాటు సిల్వర్, గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలు, మొమెంటోలతో సత్కరించారు. అలాగే నీట్‌లో సత్తా చాటిన పట్టణానికి చెందిన విద్యార్థులు మహేష్, సంజయ్, సిద్ధార్థ్, ఐఏఎస్‌కు ఎంపికైన అంబికాజైన్‌తో కలిసి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ విద్యనభ్యసించాలని సూచించారు. ఐఏఎస్‌కు ఎంపికైన అంబికాజైన్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పది, ఇంటర్ స్థాయిలో చూపిన ప్రతిభను ఉన్నత చదువుల్లోనూ కొనసాగించాలన్నారు. విద్యావేత్త గడిగెలింగప్ప, రాయలసీమ పద్మశాలి సంఘ నాయకుడు ఎంఆర్ శ్రీనివాసులు, వీరశైవ లింగాయత్ అధ్యక్షుడు రాచోటప్ప, మున్సిపల్ కౌన్సిలర్ కామర్తి నాగేషప్ప, బీసీ సంఘ నాయకులు శివకుమార్, శివదాస్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీసీలు రాజకీయంగా ఎదగాలి

గోనెగండ్ల: బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదిగిన రోజే అభివృద్ధి సాధించినట్లు అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంకతి లక్ష్మీనారాయణ అన్నారు. ఆయన ఆదివారం గోనెగండ్లలో సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు చదువుకొని విద్యావంతులు కావాలన్నారు. రాజకీయ పార్టీలు వచ్చే ఎన్నికల్లో బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో 50 శాతం సీట్లు ఇవ్వాలని కోరారు. బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, గ్రామపెద్దలు చెన్నలరాయుడు, దరగలమాబు, కౌలుట్లయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



ములుగుందంలో రథాన్ని లాగుతున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని ములుగుందంలో సమాధి అయిన అవధూత శ్రీశైలం తాత (తిక్క శంకరయ్య తాత) 12వ ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మందిరంలో తాత సమాధికి గంగ, ఆకు పూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తాత విగ్రహం, సమాధికి పూజలు చేసి దర్శించుకున్నారు. శ్రీశైలం తాత నామసస్మరణతో భక్తులు రథాన్ని లాగారు. మండలంలోని గ్రామాల నుంచే కాకుండా శ్రీశైలం, విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి కర్ణాటక రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా సిందగి తాలూకా ఆల్‌వేల్ గ్రామం నుంచి వచ్చిన తాత కుటుంబ సభ్యులు పూజలు చేసి దర్శించుకున్నారు.

రూ.14 లక్షలతో ముఖద్వారం నిర్మాణం

ములుగుందంలో వెలసిన శ్రీశైలం తాత ఆలయ ముఖద్వారాన్ని రూ.14 లక్షలతో నిర్మించారు. భక్తులు, దాతలు, గ్రామస్తుల సహకారంతో ముఖద్వారం నిర్మాణం పూర్తి చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. తాత ఆరాధనోత్సవాల సందర్భంగా ముఖద్వారానికి ప్రత్యేక పూజలు చేశారు.

నిరుపయోగంగా వాటర్ ఏటీఎంలు

తుగ్గలి: ప్రజలకు శుద్ధజలం అందించేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు నిర్వహణ లోపంతో మూతపడ్డాయి. బొందిమడుగుల, నునుసరాల్ల, ముక్కెల్ల, మారెల్ల, పెండేకల్లు జంక్షన్, పెండేకల్లు, శభాష్‌పురం, జీజీరాల్ల, చెన్నంపల్లి, రామలింగాయపల్లి, జొన్నగిరి, కడమకుంట్ల, రోళ్లపాడుతండా, జీఎర్రగుడి, రామాపురం, ఎద్దులదొడ్డి, గిరిగెట్ల, తుగ్గలి, రాతన, రాంపల్లి, కడమకుంట్ల గ్రామాల్లో వాటర్ ఏటీఎంలు ఏర్పాటు చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో కొన్ని నెలలుగా ప్రజలకు శుద్ధజలం అందకుండా పోయింది. దీంతో ప్రవేటు వాటర్ ప్లాంట్ల వైపు ప్రజలు పరుగులు తీస్తున్నారు. నెలల తరబడి శుద్ధజలం సరఫరా నిలిచిపోవడంతో వాటర్ ఏటీఎంలు తుప్పుపట్టి చెడిపోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వాటర్ ఏటీఎంలు పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మట్టెద్దుల పండుగ



కైరుప్పలలో పూజలందుకున్న మట్టి బసవన్న స్వామి

నందవరం: డివిజన్ వ్యాప్తంగా రైతన్నలు మట్టి ఎద్దుల అమావాస్య పండుగ ఘనంగా జరుపుకున్నారు. రైతన్న పంచ ప్రాణం.. ప్రత్యక్ష దైవం కాడెద్దు. పుడమి తల్లితో బసవన్నకు, కర్షకుడికి ఉన్న అనుబంధాన్ని చాటి చెప్పే పండుగే మట్టెద్దుల అమావాస్య. పండుగ సందర్భంగా రైతులు మట్టితో చేసిన జోడెద్దులను ఇంట్లో కొలువుంచి చూడముచ్చటగా అలంకరణ చేశారు. పిండివంటలు చేసుకుని నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు గావించారు. ఎద్దుల గాటిపాళ్లకు సున్నాలు వేసి మట్టి ఎద్దులను అందులో కొలువుంచి పూజించారు. వర్షాలు మెండుగా కురవాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. అనంతరం మట్టెద్దులను ఇళ్ల పైకప్పులపై ఉంచగా మరికొందరు నది, చెరువుల్లో నిమజ్జనం చేశారు.



మట్టి ఎద్దులను తయారు చేసి పూజలు చేస్తున్న చిన్నారులు

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో ఆదివారం మట్టి బసవన్నకు రైతులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. పంటలు బాగా పండాలని కైరుప్పల గ్రామంలో మట్టితో తయారు చేసిన ఎద్దును వీరభద్ర స్వామి ఆలయంలో ఉంచి పూజలు చేశారు. మట్టి ఎద్దును గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు.

'లండన్ మిషన్' స్థలంలోకి వెళ్లొద్దు

ఆలూరు: మండలంలోని ఎం.కొట్టాల గ్రామంలో 'లండన్ మిషన్' వారి స్థలంలో గ్రామస్తుల జోక్యం తగదని తహసీల్దార్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. గ్రామంలో సర్వే నంబర్ 179/ఎలో 2 సెంట్ల స్థలం గ్రామ పంచాయతీకి చెందుతుందని కొందరు అధికారుల దృష్టికి తెచ్చి తీర్మానం చేశారు. అయితే కొందరు సీఎస్ఐ చర్చికి సంబంధించిన స్థలం అని పేర్కొంటూ గ్రామస్తులతో వాదనకు దిగినట్లు తెలుస్తోంది. దీంతో ఆ స్థలం వద్ద 114 సెక్షన్ విధించినట్లు స్పష్టం చేశారు. స్థలం సరిసర ప్రాంతాల్లో గుంపులుగా ఉండరాదని ఎప్పటికప్పుడు వీఆర్వో, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ సేవకులు పర్యవేక్షణ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

ఆలూరు: కర్ణాటక మద్యం విక్రయదారులపై సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆలూరు సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎర్ర వెంకట్ తెలిపారు. నియోజకవర్గంలోకి కర్ణాటక మద్యం తరలింపు, విక్రయాలపై 6302738236 సెల్ నంబర్‌కు కాల్ లేదా మేసేజ్ చేసినా దాడులు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే నాటుసారా తయారీ, విక్రయించడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సారా తయారుచేసేవారు ఆ వృత్తి మానుకుని ఇతర పనులు చేసుకుంటూ కొత్త జీవితం ప్రారంభించాలన్నారు. కర్ణాటక నుంచి రాష్ట్రంలోకి వచ్చే అక్రమ మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు సెబ్ వెల్లడించారు.

పాము కాటుతో మహిళ మృతి

కృష్ణగిరి: పడుకున్న పరుపులో ఉన్న పాము కాటు వేయడంతో మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. తెగదొడ్డి గ్రామానికి చెందిన మాదిగ హనుమంతమ్మ (65) ఈ నెల 16న తన ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. ఉదయం గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే డోన్‌కు తరలించి వైద్యం అందించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక శనివారం రాత్రి హనుమంతమ్మ మృతి చెందింది.కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

దేవనకొండ: మండలంలో పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా రైతుల బ్యాంకుల ఖాతాలలోకి ఆర్థిక సాయం జమ కావాలంటే తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని ఏఓ సురేష్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో 700మంది రైతులు ఈ–కేవైసీ నమోదు చేయించుకోలేదన్నారు. సంబంధిత గ్రామాల రైతులకు ఈ–కేవైసీపై ఎంపీఈఓ, వీఏఏ, గ్రామ వలంటీర్లు అవగాహన కల్పించాలని ఏఓ సూచించారు.

కలుషిత నీరు సరఫరా



చింతకుంట పంప్‌హౌస్ నుంచి నీటిని నేరుగా సరఫరా చేస్తున్న దృశ్యం

హాలహర్వి: మండలంలోని చింతకుంట వాటర్ పంప్‌హౌస్‌లో నీటిని ఫిల్టర్ చేయకుండా నేరుగా కుళాయిలకు విడుదల చేయడంతో ప్రజలు కలుషిత నీటిని తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు. నీటిని ఫిల్టర్ చేసి సరఫరా చేయాలని ప్రజలు కోరినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా నీటిని ఫిల్టర్ చేసి కుళాయిలకు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మిర్చి రైతు కన్నీరు



బోయనపల్లెలో వైరస్ దెబ్బకు ఎదుగుదల లేని మిర్చి పంటను తొలగిస్తున్న తలారి చంద్ర



మొక్కలను పీకేస్తున్న వగురూరు కిషోర్ రెడ్డి

వెల్దుర్తి: మండల పరిధిలోని బోయనపల్లె, రామళ్లకోట, నర్సాపురం, సర్పరాజాపురం, కలుగొట్ల, పుల్లగుమ్మి, సిద్ధినగట్టు తదితర గ్రామాల పరిధిలోని బోర్లు, బావుల కింద గత నెల 1 నుంచి 15వ తేదీ మధ్య నాటిన వేల ఎకరాల్లోని పచ్చి మిర్చి పంట ఎదుగుదల లేకపోవడంతో 80 శాతం మంది రైతులు మొక్కలను తొలగిస్తున్నారు. 20 శాతం మంది ఇంకా ఆశ చావక పంట వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఏటా ఆయా గ్రామాల పరిధిలో ఏప్రిల్ నెలలో పచ్చి మిర్చి సాగుచేసేవారు. అధికారుల సూచనలు, మోపైన ఎండల ఫలితంగా ఈ సారి మే నెలలో మిర్చి సాగుచేశారు. రామళ్లకోట, ప్యాపిలి నర్సరీలలో పెంచిన నార ఒకటి 70 పైసల ప్రకారం కొని ఎకరాకు 25 వేల మొక్కలు నాటుకున్నారు. చనిపోయిన వాటితో కలుపుకుని ఎకరాకు 40 వేల మొక్కలు అవసరమయ్యాయి. ఇక భూమి మందులు, కలుపులు, పిచికారీ మందులు అంటూ ఎకరాకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. రెండు, మూడు వానలు తోడైతే 40 రోజులకు కాపు వచ్చి మొదటి తెంపులు పడాలి. అయితే చినుకు జాడ లేకపోవడంతో జూన్ మొదటి నుంచే మొక్క ఎదుగుదల లేక, తీవ్రమైన ఎండలకు వైరస్ సోకడంతో కాపు మాట దేవుడెరుగు మొక్క చనిపోయే దశలో ఉండడంతో ఏమీ చేయలేని స్థితిలో రైతులు తమ పంటలను తొలగిస్తున్నారు. రూ.కోట్ల పెట్టుబడులు మట్టిపాలయ్యాయి. ప్రస్తుత దశలో వానలు కురిసిన తరువాత అదే పొలంలో సగం పచ్చి మిర్చి, సగం పసుపు, ఇతరత్రా పంటలు విత్తు వేసే యోచనలో ఉన్నట్లు రైతులు తెలుపుతున్నారు. ఇక నార విషయానికి వస్తే రామళ్లకోట, ప్యాపిలి ఇలా పలు ప్రాంతాల నర్సరీలు ఎక్కువగా వీఎస్ఆర్, కనకధార, జెర్సీ, ఇతరత్రా కంపెనీల విత్తనాలను కేజీ రూ.70 వేల వరకు కొని పెంచారు. కంపెనీ వారు నాసిరకం విత్తనాలు ఇచ్చారా, లేక నర్సరీ వారు తక్కువ రేటుకు పాత విత్తనాలు కొన్నారా, లేక ఎండలు మోపై పంటలు ఎండిపోయాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు విచారించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. గతంలో ఈ సమయానికి మిర్చి పంట కాపునకు వచ్చి ఆయా గ్రామాల నుంచి రోజూ 20 లారీల మిరప మార్కెట్‌కు వెళ్లేది. అలాంటిది నేడు ఒక్క ఎకరం కూడా దిగుబడి లేక మార్కెట్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పచ్చి మిర్చి కిలో రూ.వంద పలుకుతుండడంతో వినియోగదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై హార్టికల్చర్ ఆఫీసర్ విజయలక్ష్మి పేర్కొంటూ.. 15 రోజులుగా వెల్దుర్తి మండల పరిధిలోని పచ్చి మిర్చి పైర్లను పరిశీలించామన్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల వైరస్ సోకి ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. త్వరలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆయా ప్రాంతాలకు వచ్చి పరిశీలిస్తారని తెలిపారు.

క్రైం కార్నర్

గాయపడిన వ్యక్తి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామానికి చెందిన శ్రీనివాసులు (39) రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ ఆదివారం తెలిపారు. శనివారం శ్రీనివాసులు స్కూటర్‌పై ములుగుందం నుంచి అగ్రహారంకు వెళ్తుండగా, అగ్రహారం నుంచి ములుగుందంకు స్కూటర్‌పై వస్తున్న అన్వర్‌బాషా, దస్తగిరి ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక శ్రీనివాసులు మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి: మండలానికి చెందిన ఇద్దరు ఆదివారం జరిగిన ప్రమాదాల్లో గాయపడ్డారు. మండల కేంద్రానికి చెందిన కురువ ఎల్లకృష్ణ పశువులు మేపుకుని రామళ్లకోట రోడ్డులో తిరిగివస్తుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన కురువ ఎల్లకృష్ణను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే మండల పరిధిలోని గువ్వలకుంట్లకు చెందిన కురువ శ్రీనివాసులు డోన్‌లో మోటార్ రివైండింగ్ మెకానిక్‌గా షాప్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం మోటార్ రిపేర్ చేస్తుండగా అందులోని వేడి ఆయిల్ ద్వారా మంటలు ఎగసిపడి శ్రీనివాసులుకు అంటుకున్నాయి. క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, ఆయన కుమారుడు వెల్దుర్తి వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్ కంగాటి వంశీధర్ రెడ్డి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ఎల్లకృష్ణను, శ్రీనివాసులును పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

దాడి కేసు నమోదు

వెల్దుర్తి: డోన్ మండలం తిమ్మాపురంకు చెందిన లక్ష్మన్నపై అతని మొదటి భార్య కుమారుడు, మరికొందరు దాడి చేసి గాయపరిచారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మన్న, అతని భార్య వెల్దుర్తి మండలం గువ్వలకుంట్ల గ్రామ పరిధిలో గుత్తకు తీసుకున్న పొలంలో శనివారం పనులు చేసుకుంటున్నారు. ఈ సమయంలో లక్ష్మన్నపై అతని మొదటి భార్య కుమారుడు సుధాకర్, పెయింట్ రాజు, మరికొందరు గొడ్డలి, క్రికెట్ బ్యాట్‌లతో దాడిచేశారు. వారి అరుపులు విని పక్క పొలంవారు రాగా నిందితులు పారిపోయారు. ఈ క్రమంలో నిందితులు బైక్, గొడ్డలి, బ్యాట్‌ను అక్కడే వదిలి వెళ్లారు. దాడిలో గాయపడ్డ లక్ష్మన్నను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి కుమారుడు సురేంద్ర ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.